అలా వదిలేశారంతే!

- పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న ఎట్టిపశువులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు, పాదచారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

డోన్ : ఎట్టిపశువులు బెడద ఎక్కువైంది. నియోజకర్గ కేంద్రం డోన్ పట్టణంలో పశువులు విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ అయిన డోన్ పట్టణంలో పల్లెలను తలపించేలా ఆవులు,ఎద్దులు, దూడలు సంచిరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎట్టిపశువులను అలా వదిలేశారంతే అనేలా ఉంది పరిస్థితి. డోన్ పట్టణంలో దాదాపు 300 ఎట్టి పశువులు ఉన్నట్లు సమాచారం. ఇవి ఇష్టారాజ్యంగా తరుగుతుండడంతో వాహనచోదకులు, బాటసారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రత్యేకించి వృద్ధులు, చిన్నారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ సంచరిస్తుండటం, నడిరోడ్డులో సేదతీరుతుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నడిరోడ్డులో సేదతీరే సమయంలో అనుకోకుండా వచ్చిన వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అప్పుడప్పుడు పశువులు పోట్లాడినప్పుడు జనం పరుగులు తీయాల్సిందే. ఈ సమయంలో వాహనచోదకులు, బాటసారులు గాయాలకు గురైన సందర్భాలు లేకపోలేదు. అయినా మున్సిపల్ అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



రోడ్డుపై యథేచ్ఛగా సంచరిస్తున్న ఎట్టిపశువులు

దివ్యాంగుడిపై దాడిచేసిన ఎట్టిపశువు

ఇటీవల స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) వద్ద ఓ దివ్యాంగుడిపై ఎట్టిపశువు దాడి చేసింది. అనుకోకుండా దివ్యాంగుడిని తీవ్రంగా కుమ్మేసింది. ఏకదాటిగా దాడిచేస్తున్న పశువును చెదరగొట్టేందుకు స్థానికులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. చివరకు పైపులతో స్థానికులు పశువుపై దాడికి దిగడంతో దివ్యాంగుడిని వదిలేసిందా ఎట్టిపశువు. తీవ్రంగా గాయపడిన దివ్యాంగుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు స్థానికులు. ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు డోన్ పట్టణంలో జరుగుతూనే ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువు అనారోగ్యంతో మృతి చెందినా రోజుల తరబడి పట్టించుకునే నాథుడు కరువయ్యారనే పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని డోన్ పట్టణ ప్రజలు కోరుతున్నారు .

పరిష్కార చర్యలు తీసుకుంటాం



ప్రజల జీవనానికి ఆటంకంగా మారిన ఎట్టి పశువులను కట్టడిచేస్తాం. వాటి యజమానులందరినీ గుర్తించి పశువులను బయటకు వదలకుండా తగుచర్యలు తీసుకుంటాం. మా హెచ్చరికలను ఖాతరు చేయని వారికి భారీ జరిమానాలు విధించడంతో పాటు ఎట్టి పశువులను బందెలదొడ్డికి తరలిస్తాం. **– డాక్టర్ జయరాం, మున్సిపల్ కమిషనర్, డోన్.**



రోడ్డుపై మృతి చెందిన పశువు (ఫైల్)



గాంధీ బొమ్మ వద్ద రోడ్డుపై సేదతీరుతున్న ఎట్టిపశువులు



దివ్యాంగుడిపై దాడి చేస్తున్న ఎట్టి పశువు (ఫైల్)

క్లుప్తంగా

ప్రభుత్వాసుపత్రిలో పౌష్టికాహారం పంపిణీ



రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులు, గర్భిణులు వారి సహాయకులకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. కర్నూలు పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఏసుదాసు ఆర్థిక సాయంతో రోగులకు రొట్టె, గుడ్లు, పప్పు పంపిణీ చేశామని ఆదరణ సంస్థ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ తెలిపారు.

సన్మానం



రిటైర్డు టీచర్లను సత్కరిస్తున్న నాయకులు

డోన్ : పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు శివప్రసాద్, శివశంకరయ్య, గ్రేసమ్మలను ఆదివారం స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వారికి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి భానుసింగ్, కార్యదర్శి గాలయ్య, యూటీఎఫ్ నాయకులు నరసింహులు, ఎస్‌టీయూ నాయకులు షణ్ముర్తి, రామక్రి ష్ణారెడ్డి, సంఘం గౌరవాధ్యక్షులు మౌళాలి, కోశాధికారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వదలని వర్షం



ఆకుమల్లలో నిల్వ ఉన్న వర్షపు నీరు

సంజామల: వర్షం వదలడం లేదు. ఆదివారం మండల కేంద్రం సంజామలతో పాటు ఆయ గ్రామాలలో మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మొబ్బులు కమ్ముకున్న ఆకాశం సాయంత్రం నుంచి ఉరుములు, మెరుపులతోకూడిన వర్షం కురిసింది. మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి ముక్కమల్ల చెరువు కళకళలాడుతుంది. గ్రామాలలో వంకలు, వాగులు పారుతున్నాయి.

గిడ్డంగుల శాఖ డైరెక్టర్ పదవికి రాజీనామా

బేతంచెర్ల: రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ పదవికి బేతంచెర్ల పట్టణానికి చెందిన బాబుల్ రెడ్డి ఆదివారం రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో పదవికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. పదవి రావడానికి తోడ్పాటు అందించిన మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– బనగానపల్లె ఆర్ అండ్‌బీ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. బనగానపల్లె నుంచి కోవెలకుంట్లకు ప్రయాణికులతో వస్తున్న ఆటో అమడాల మెట్ట సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన ఉసేన్‌పీరా అనే వ్యక్తి గాయపడ్డాడు. క్షతగాత్రునికి స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

డోన్ టౌన్ : దేశాభివృద్ధి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన ప్రధాని మోదీతోనే సాధ్యమని బీజేపీ డోన్ అసెంబ్లీ కన్వీనర్ సందు వెంకటరమణ పేర్కొన్నారు. ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో సంబరాలు చేసుకున్నారు. పోలీసు స్టేషన్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ, టీడీపీ,జనసేన నాయకులు భూమనాగన్న, హుసేనప్పలతో కలిసి కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా బీజేపీ జిల్లా కార్యదర్శి వడ్డే మహారాజ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు హేమ సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సమైఖ్యాంధ్ర కట్ట వద్ద బాణా సంచా కాల్చుతూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

రేపు యల్లమాంభేశ్వరి ఆరాధనోత్సవం



యల్లమాంభేశ్వరి మూల విరాట్

డోన్ టౌన్ : పట్టణంలోని కొండపేటలో వెలసిన శాంభవి రేణుక యల్లమాంభేశ్వరి దేవి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆరాధనోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఏఈ నాగరాజు ఆదివారం తెలిపారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, బోనాల సమర్పణ, అఖండ జ్యోతి, మంగళ హారతులు,తీర్థ ప్రసాదాల వితరణ, మద్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం రామచంద్రమాలిక్ బాబా భజన మండలి, వెంకటనాయుని పల్లె శివరామాంజనేయ భజన మండలి, దుర్గపల్లి శ్రీపెద్దమ్మతల్లి భజన మండలి సంయుక్తంగా భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా కళాకారుడు కురుకుంద వెంకటరమణచే పాటల కచేరి ఏర్పాటు చేశామన్నారు. వార్షికోత్సవాలకు శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయం ప్రధాన ఉపాసకులు కట్టకాటి ఉదయనరసింహరాజు నాయుడు హాజరవుతారని వివరించారు.



బాలుర ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గుర్తుకొస్తున్నాయి

- 1978–79 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమ్మేళనం
- వేదికైన ప్యాపిలి బాలుర ఉన్నత పాఠశాల

ప్యాపిలి: 45 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు, వ్యవసాయం వంటి వృత్తులు చేస్తూ స్థిరపడ్డారు. ప్రస్తుతం ఆరుపదుల వయస్సు కలిగిన వీరు ఆదివారం కలుసుకున్నారు. ఇందుకు వారు చదువుకున్న పాఠశాల వేదికైంది. ప్యాపిలిలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1978–89 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 45 మంది నాలుగున్నర దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో ఆ ప్రదేశంలో సందడి వాతావరణం నెలకొంది. ఒకరినొకరు గుర్తు పట్టలేనంతగా మారిపోయిన పూర్వ విద్యార్థులు నాడు తాము చదువుకున్న పాఠశాలను, తరగతి గదులను కలియతిరిగి గతాన్ని గుర్తు చేసుకున్నారు. నాడు తమ గురువులు నేర్పిన విద్య, క్రమశిక్షణతోనే తాము ఈ రోజు ఉపాధ్యాయులుగా, వ్యాపారవేత్తలుగా, ఉద్యోగులుగా, రాజకీయ నాయకులుగా మంచి స్థానాల్లో ఉన్నామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకున్నారు. పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ ఏడాది పదోతరగతిలో మంచి మార్కులు సాధించిన రియాశ్రీ, అఖిల, లిఖిత్, చంద్రకాంత్, ఆచారి తదితరులను సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఖాజా హుసేన్, చిన్ని నాగరాజు, మహమ్మద్, కమతం భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, ప్రభాకర్, జీవీ రమణ, జేపీ షుకూర్, బైసాని మధు, మాణిక్యం శెట్టి, నూకల మధు, పూజారి శ్రీనివాసులు, వంకదారి రాధ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల జెడ్పీహెచ్ఎస్ స్కూల్ పూర్వవిద్యార్థుల(1998–1999) సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. దాదాపు 25 సంవత్సరాల తర్వాత పూర్వవిద్యార్థులు చదువుకున్న స్కూల్‌లో ఒకేవేదికపై చేరారు. వివిధ రంగాల్లో స్థిరపడిని స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకురించుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు హెచ్ఎం ఉస్సేన్ సాహేబ్, విరోజ్, శ్రీకాంత్, బసవ ప్రసాద్, శ్రీనువాసులు, వేంకటేశ్వర్లు, రసూల్, సరేశ్వర్ రావు, వెంకటేశ్వర్ రెడ్డి, ఆసన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు విజయకుమార్, కృష్ణయ్య, రమాదేవి, మధు సుధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గురువులతో పూర్వవిద్యార్థులు

మోటార్ సైకిళ్లు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగులవరం గ్రామ సమీపంలో ఆదివారం రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఒకరు తీవ్రగా గాయపడ్డారు. వెల్దుర్తి మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన మనోజ్ రుద్రవరం మండలంలోని ఆలమూరులో ఉన్న బంధువుల ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. ఆర్.నాగులవరం సమీపంలో వెళ్తుండగా ఎదురుగా మరో వ్యక్తి మోటార్ సైకిల్‌పై రుద్రవరం వైపు వెళ్తుండగా అదుపు తప్పి రెండు బైక్‌లు ఎదురుగా ఢీకొన్నాయి. దీంతో మనోజ్‌కు తీవ్ర గాయాలు కాగా..వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

వార్డు సభ్యురాలి మృతి

మహానంది: మహానంది పంచాయతీ 11వ వార్డు సభ్యురాలు, సీపీఐ నాయకురాలు మద్దమ్మ(58) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు సామేలు, ధనుంజయ ఆమె ఇంటికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నికైన మద్దమ్మ సీపీఐలో చురుగ్గా పనిచేశారని, ప్రజా సమస్యల పట్ల స్పందిస్తూ అందరిలో మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. ఆమె అకాల మరణం బాధాకరమన్నారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నటు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధికి సంబంధించి విద్యుత్ సరఫరా వేళలు వివరించారు. ముక్కమల్ల, వసంతాపురం, కమలపురి, ముదిగేడు, ఎగ్గోని, గిద్దలూరు, రెడ్డిపల్లె, ఆల్వకొండ, ఆర్.లింగందిన్నె, అక్కంపల్లె, కానాల, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె గ్రామాల ఫీడర్ల పరిధిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరుకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

నేటి నుంచి జీలుగల పంపిణీ

బనగానపల్లె : ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు సోమవారం నుంచి గ్రామాల వారీగా పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధి కారి సుబ్బారెడ్డి తెలిపారు. మండలానికి 110 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయన్నారు. 50 శాతం సబ్సిడీపై కిలో రూ.44 ప్రకారం ప్రతి రైతు అవసరం మేరకు 50–60 కిలోలు పంపిణీ చేస్తామని చెప్పారు.



ముద్దవరం గ్రామంలో నిండు కుండలా చెరువు



నిండుగా దర్శనమిస్తున్న ముసలాయిచెర్వు గ్రామం చెరువు

చెరువులకు జలకళ!

బేతంచెర్ల: వరుణుడు కరుణిస్తుండడంతో చెరువులకు జలకళ సంతరించుకుంది. ఖరీఫ్ సీజన్‌కు ముందే అడపాదడపా కురుసింది. జూన్ 1 నుంచి ఖరీఫ్ సీజన్ ప్రాంభవ్వగా విస్తారంగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో మండల పరిధిలోని గ్రామాల్లోని చెర్వులు, కుంటలు, చెక్ డ్యామ్‌లు కళకళలాడుతున్నాయి. గతేడాది నవంబర్ నుంచి మే వరకు సరైన వర్షాలు కరువక బోరుబావుల్లో భూగర్భజలాలు ఇంకిపోయి తాగునీటి సమస్య తలెత్తింది. ప్రస్తుతం వర్షాలు పడటంతో భూగర్భజాలాలు పెరిగాయి. ముద్దవరం, ముసలాయి చెర్వు, గూటుపల్లె చెర్వులు నిండాయి. వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీమద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో మద్దిలేరు వాగు, సిమెంట్ నగర్ గ్రామంలోని గుండం వాగు పారుతుండటంతో సేలయేటి అందాలు కనువిందు చేస్తున్నాయి.



గుండం వాగు వద్ద జలపాతంలా పారుతున్న నీరు



పొంగిపొర్లుతున్న మద్దలేరువాగు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

- టీడీపీ సానుభూతి పరులనూ వదలని వైనం
- పోలీస్ స్టేషన్ వద్ద టీడీపీ ఇరువర్గాల వాగ్వివాదం.. చెదరగొట్టిన పోలీసులు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త వడ్డె శ్రీనుపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ నుంచి ఇటీవల టీడీపీలో చేరిన ఉలవల నరసింహుడు.. వైఎస్సార్‌సీపీ కార్యకర్త వడ్డె శ్రీనును ఇంటి వద్దకు పిలిపించుకొని మీ బంధువులంతా టీడీపీలో ఉన్నారు, నీవు కూడా మా వెంబడి తిరగాలని హుకుం జారీ చేశారు. ఆ పార్టీలో నాకు లబ్ధి చేకూరింది, వైఎస్సార్‌సీపీలోనే ఉంటానని శ్రీను సమాధానం ఇచ్చాడు. అలానా సాయంత్రం మీ బంధువులను తీసుకుని రమ్మడంతో వాళ్లతో పాటు వెళ్లాడు. ఇంటి వద్దకు వెళ్లగా మాట్లాడుతుండగానే ఒక్క సారిగా కట్టెలతో శ్రీనుపై నరసింహుడుతోపాటు కొందరు టీడీపీ కార్యకర్తలు దాడికి దిగారు. మాట్లాడుదామని తీసుకొని వస్తే దాడి చేస్తారా.. ఇది సమంజసం కాదని టీడీపీ సానుభూతిపరులు వడ్డె వెంకటయ్య సూచించడంతో టీడీపీ కార్యకర్తలు ఆగ్రహించారు. వడ్డె వెంకటయ్యతోపాటు అతని కుమారుడు మహేష్‌పైనా వారు దాడికి పాల్పడ్డారు. దీంతో గాయపడిన బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇరువర్గాలను పోలీసులు విచారించారు. ఈ నేపథ్యంలో కొలిమిగుండ్లతో పాటు ఇతర గ్రామాల నుంచి వచ్చిన టీడీపీ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ సమీపంలో గుంపులుగా చేరారు. ఈ సమయంలో టీడీపీలోని ఇరు వర్గాల మధ్య మాటమాట పెరగడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ప్రశాంతంగా ఉన్న కొలిమిగుండ్లలో అల్లర్లు జరుగుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పదవికి రాజీనామా

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె భానుముక్కల వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు నీలిశ్రీనివాసులు ఆదివా రం తెలిపారు. రాజీనామా పత్రాన్ని నంద్యాల డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్‌కు అందజేశామన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న నాయకులు



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కోవెలకుంట్ల: స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర మాజీ అదనపు ప్రధాన కార్యదర్శి ప్రసాదరెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి తదితరులు మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ప్రాథమిక విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసి పేద విద్యార్థులకు విద్యను దూరం చేసి మధ్యలో బడి మానుకునేందుకు కారణమైన 117జీవోను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, ఎంవీ సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఓబులేసు, కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరీష్, రవీంద్రారెడ్డి, నాగేశ్వరయ్య, జీవీ నారాయణరెడ్డి, మనోహర్, పాండురంగారెడ్డి, ఉసేన్‌సాహెబ్, భాస్కర్‌రెడ్డి, రవికుమార్, ఆదిశేషగిరిరావు, పీవీ సుబ్బారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్యాపిలి: స్థానిక కార్యాలయంలో ఆదివారం ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షులు హాజీ మస్తాన్ వలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిలర్ వెంకట్‌నాయక్ పతాకావిష్కరణ చేశారు. అమరులైన ఎస్టీయూ నాయకుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ వాణి కన్వీనర్ చిన్నపరెడ్డి, ఎస్టీయూ నాయకులు చంద్రమౌళి, కిరణ్ కుమార్, మద్దిలేటి, చంద్రబాబు, విజయ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో సండే సందడి

మహానంది: మహానంది ఆలయంలో భక్తజన సందడి కొనసాగుతుంది. ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉచిత, ఆర్జిత సేవా టికెట్లు, మహదాశీర్వచనం, అభిషేకం సేవల ద్వారా దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న నవనంది క్షేత్రాలైన వినాయకనంది, గరుడనంది ఆలయాలను భక్తులకు సందర్శించి పూజలు చేపట్టారు.



ఆలయ ప్రాంగణంలో భక్తులరద్దీ

మహానందీశ్వరుడికి అభిషేకార్చనలు

మహానందిలో కొలువైన శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో అర్చకులు స్వామి, అమ్మవార్లకు రుద్రాభిషేకం, కుంకుమార్చనలు చేపట్టారు. స్థానిక యాగశాలలో స్వామి, అమ్మవార్లకు నిత్య కల్యాణోత్సవం నిర్వహించగా.. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా వీక్షించి స్వామివారి అనుగ్రహం పొందారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో ..

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో తెలంగాణ రాష్ట్రం, పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు విజయరామారావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు నెల్లూరు జిల్లా డీఆర్ఓ, శ్రీశైలం ఈఓగా పనిచేసిన ఎస్.లవన్న మహానందికి వచ్చారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వారికి వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.